ప్రజాశక్తి
సోమవారం 25 డిసెంబర్ 2023
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

నిరసన జ్వాల

అనకాపల్లిలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టిన అంగన్‌వాడీలు, వారికి మద్దతుగా నిలిచిన చిన్నారులు, ప్రజలు

విశాఖలో ఒంటి కాలిపై నిల్చొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

పట్టువిడవని అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల సమ్మె ఆదివారానికి 13వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం దిగిరాకపోవడంతో ఎక్కడికక్కడ నిరసనలు హోరెత్తాయి. సాయంత్రం వేళ అన్ని ప్రాంతాల్లోనూ కొవ్వొత్తుల ప్రదర్శనలు చేపట్టారు. వారి పోరాటానికి చిన్నారులు, స్థానికులు మద్దతు తెలిపారు.

(వార్తలు 8లో..)

ముగిసిన నృత్యోత్సవాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ, కళాభారతి సంవత్సరాంతపు మూడు రోజుల నృత్యోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు కార్యక్రమాలను కళాభారతి అధ్యక్షులు మంతెన సత్యనారాయణరాజు, కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, ట్రస్టీ సుసర్ల రామ గోపాల్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రాంభించారు. చివరి రోజు అనకాపల్లి నవ చైతన్య కళా సమితికి చెందిన 60 మంది కళాకారులు అద్భుత ప్రదర్శనలు ఇచ్చారు. గంగణపతి, కోలాటం, రేలా రేలా, జాలారి నృత్యం, రైతుల నృత్యం, భక్త ప్రహ్లాద, శ్రీనివాస కల్యాణం ప్రదర్శనలు, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా డాక్టర్ గుమ్ములూరి రాంబాబు మాట్లాడుతూ ఉత్సవాలకు ఆర్థిక సాయం అందించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్న కళాకారులు

క్రిస్మస్ జోష్

సర్వాంగ సుందరంగా చర్చిలు - విశాఖలో పండగ సందడి

విశాఖ సర్వతోముఖాభివృద్ధికి కృషి

▶ వార్త 2లో..

సమగ్ర శిక్ష ఉద్యోగులపై నిర్లక్ష్యం తగదు

▶ వార్త 2లో..

ఎయు స్నాతకోత్సవం వాయిదా

▶ వార్త 2లో..

పెరుగుతున్న కోవిడ్ కేసులు

విశాఖలో మూడు రోజుల్లో 11 మందికి పాజిటివ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో కోవిడ్ కేసులు క్రమేపీ పెరుగుతున్నాయి. శుక్రవారం నలుగురు, శనివారం ముగ్గురు కోవిడ్ బారిన పడగా ఆదివారం మరో నలుగురికి పాజిటివ్ వచ్చింది. దీంతో మొత్తం కేసుల సంఖ్య 11కు చేరింది. వీరి నుంచి సేకరించిన నమూనాలను జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం పూణె పంపినట్లు ఎఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. వీరికి సోకింది ఏ వేరియంట్ అన్న విషయం నిర్ధారణ కావాల్సి ఉందన్నారు. కాగా, గడిచిన 24 గంటల్లో 24 మందికి పరీక్షలు చేయగా నలుగురికి కోవిడ్ నిర్ధారణ అయింది. వీరిలో కైలాసపురం ప్రాంతానికి చెందిన 51 ఏళ్ల మహిళ ప్రభుత్వ ఊపిరితిత్తుల ఆసుపత్రిలో వివిధ అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతోంది. ఆమెలో కోవిడ్ లక్షణాలు కనిపించడంతో పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ వచ్చింది. ప్రస్తుతం ఆమెకు వెంటిలేటర్ మీద చికిత్స అందిస్తున్నారు.

అనకాపల్లి జిల్లాలో ఒక కేసు

సబ్బవరం : అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలంలోని రాయపుర అగ్రహారం గ్రామంలో కోవిడ్ కేసు నమోదైనట్టు పిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి ఎస్ఎన్ఆర్. చక్రవర్తి తెలిపారు. మండలంలోని ప్రజలు అప్రమతంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భౌతిక దూరం పాటించాలని, మాస్కులు వినియోగించాలని, శానిటైజర్‌తో చేతులు శుభ్రం చేసుకోవాలని కోరారు.

కోవిడ్ పట్ల జాగ్రత్తలు అవసరం

◆ బాధితుల కోసం అన్ని ఏర్పాట్లూ చేశాం ◆ అనకాపల్లి జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయకర్త డాక్టర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అనకాపల్లి

కోవిడ్ కేసులు మెల్లమెల్లగా పెరుగుతున్న నేపథ్యంలో అందరూ తగు జాగ్రత్తలు పాటించాలని అనకాపల్లి జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయకర్త, ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు ఇప్పటికే సంసిద్ధమయ్యామని తెలిపారు. తనను కలిసి 'ప్రజాశక్తి'తో ఆయన ముచ్చటించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

కోవిడ్ కేసులు నమోదు అవుతున్నాయా ?

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అడపాదడపా కేసులు నమోదు అవుతున్నాయి. విశాఖపట్నంలో మూడు రోజులుగా కేసులు వస్తున్నాయి.

కోవిడ్ విస్తరణ ఎలా ఉంటుందని భావిస్తున్నారు ?

ఇప్పుడు వచ్చే కేసుల్లో దగ్గు, జలుబు, ఒంటి నొప్పులు, జ్వరం వచ్చే అవకాశం ఉంది. కోవిడ్ వేగంగా విస్తరించే అవకాశం ఉంది అయితే, ఇవి రోగులను కాస్త ఇబ్బంది పెట్టేవేగానీ మరణాలు సంభవించే ప్రమాదం లేదు. కాస్త ముందస్తు చర్యలు తీసుకుంటే నివారించవచ్చు.

కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యారా ?

జిల్లాలోని అనకాపల్లి ఎన్‌టిఆర్ వైద్యాలయం, నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో 20 బెడ్స్‌తో వార్డు, ఇన్ పేషెంట్స్‌కు కావలసిన ఆక్సిజన్, ట్రాన్స్‌పోర్టు బెడ్స్ ఏర్పాటు చేశాం. అలాగే సిబ్బందికి ఓరియంటేషన్ ఇచ్చాం. కోవిడ్ కన్ఫర్మేషన్ సెంటర్ రీ ఓపెన్ చేసి సిద్ధంగా ఉన్నాం.

కోవిడ్ రోగులకు కావలసిన మందులు అందుబాటులో ఉన్నాయా ?

ఆసుపత్రిలో కోవిడ్ రోగులకు కావలసిన మందులు పరిపూర్ణంగా అందుబాటులో ఉన్నాయి. ఇతర రోగాలకు కూడా మందుల కొరత లేకుండా ఉంది.

జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ గురించి చెబుతారా ?

జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి దశ విజయవంతం అయింది. రెండో దశ కొనసాగింపునకు హెల్త్ సెక్రటరీ, హెల్త్ కమిషనర్ ఆదేశాలతో కలెక్టర్ రవి పటాన్ శెట్టి ఇప్పటికే ప్రణాళిక రచించారు.

ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో సిటీ స్కాన్ పరిస్థితేంటి ?

త్వరలో అధునాతన సిటీ స్కాన్ ఏర్పాటు చేస్తున్నాం. అందులో ముగ్గురు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

పెరుగుతున్న కోవిడ్ కేసులు

టెక్నీషియన్లు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒక స్టాఫ్ నర్స్, స్వీపర్, సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తారు. రోగుల మీద ఎటువంటి ఆర్థిక భారమూ పడకుండా పిపిపి మోడ్‌లో ఉచితంగా సేవలు అందిస్తాం.

జిల్లా ఆసుపత్రికి రోజూ ఎంతమంది రోగులు వస్తున్నారు ?

ఎన్‌టిఆర్ జిల్లా వైద్యాలయానికి రోజూ కనీసం 800 నుంచి 1100 మంది వరకు రోగులు వస్తున్నారు. దీనిలో అధిక శాతం గైనిక్, ఆర్థో కేసులు ఉంటున్నాయి.

సిబ్బంది కొరత ఉందా ?

ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో 42 మంది వైద్యులకుగాను 35 మంది ఉన్నారు. ఐదు సివిల్ సర్జన్ పోస్టులు, ఇఎన్‌టిసిఎఎస్, గైనిక్ సివిల్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, సిఎస్ఆర్ఎంఒ, సైకియాట్రిక్, ఆప్తాల్మిక్ పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది.

మాట్లాడుతున్న వైవి.సుబ్బారెడ్డి

విశాఖ సర్వతోముఖాభివృద్ధికి కృషి

హనుమంతవాక వద్ద ఫ్లైఓవర్

నగరాభివృద్ధికి క్రెడాయ్ సహకారం అవసరం : వైవి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నట్టు వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి తెలిపారు. నగరంలోని హనుమంతవాక వద్ద రద్దీగా ఉండే జంక్షన్‌లో త్వరలో. రూ.40 కోట్లతో ఫ్లైఓవర్ రానుందని వెల్లడించారు. ఎంవిపి కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో జరుగుతున్న క్రెడాయ్ వైజాగ్ ఎక్స్‌పోలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. నగరంలో పచ్చదనం ఆవశ్యకతను వివరించారు. నగరంలో ఇప్పుడు 35 శాతం గ్రీన్ కవర్ ఉందని, 45 శాతం గ్రీన్ కవర్ ఉన్న సింగపూర్‌తో పోటీ పడడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. దీన్ని సాధించడానికి క్రెడాయ్ విశాఖపట్నం ఛాప్టర్ సహకారం చాలా అవసరమని సుబ్బారెడ్డి అన్నారు అందరికీ ఇళ్లు అందించడానికి క్రెడాయ్ చేస్తున్న కృషిని అభినందించారు. అంతకుముందు జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ హౌసింగ్ ప్రాజెక్టుల టెర్రస్‌లపై గ్రీన్ కవర్ ఉండేలా కృషి చేస్తున్నామని చెప్పారు. బహిరంగ ప్రదేశాలను పబ్లిక్, పిల్లల పార్కులుగా అభివృద్ధి చేస్తామన్నారు. జివిఎంసి 'ఎకో-వైజాగ్'కి కట్టుబడి ఉందన్నారు. హౌసింగ్ ప్రాజెక్టులలో పచ్చదనాన్ని ఉన్నత ప్రమాణాలుగా ఏర్పాటు చేయాలని బిల్డర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, క్రెడాయి జాతీయ జాయింట్ సెక్రటరీ, బి.రాజా శ్రీనివాస్, విశాఖపట్నం చాప్టర్ చైర్మన్ కెఎస్ఆర్‌కె.రాజు, ఎక్స్‌పో కార్యదర్శి వి.శ్రీను, నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె.రాజు, మాజీ. స్మార్ట్ సిటీ వైజాగ్ కార్పొరేషన్ చైర్మన్ జి.వెంకటేశ్వరరావు (జివి) తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబేద్కర్

సమగ్ర శిక్ష ఉద్యోగులపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ విమర్శించారు. వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు వెంటనే చర్చలకు పిలవాలన్నారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన ధర్నా శిబిరాన్ని ఆయన సంఘం జిల్లా కోశాధికారి కె.రాంబాబుతో కలిసి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ సంఘాలతో కలిసి చర్చించే సంప్రదాయాన్ని గాలికొదిలేసిందని విమర్శించారు. ప్రాజెక్టులో ఒకే క్యాడర్‌లో ఉన్న ఉద్యోగులకు రకరకాలుగా వేతనాలు చెల్లిస్తూ కొత్త విధానాలకు తెరతీసిందని తెలిపారు. పార్ట్ టైం పేరుతో తక్కువ జీతాలు ఇచ్చే విధానాన్ని అమలు చేస్తోందని అన్నారు. ఎన్నికలకు ముందు కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామని ఇచ్చిన హామీలను జగన్ విస్మరించారని తెలిపారు. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పి.పుండరీకాక్ష, కార్యదర్శి ఎల్.చైతన్య, నాయకులు శ్రీరామమూర్తి, వినోద్, సయిదా సుల్తానా, రాంబాబు, వసుమతి పాల్గొన్నారు.

క్రిస్మస్ జోష్

సర్వాంగ సుందరంగా చర్చిలు

విశాఖలో పండగ సందడి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ సర్వమతాల ఆనంద డోలిక. ఇక్కడ ఏ పండగ జరిగినా సందడే సందడి. క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించుకునే ప్రధాన నగరాల్లో మనమూ ఉన్నాం. ఈ క్రమంలోనే నగరంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం జరిగే ఈ సర్వ స్పర్శ పండగకు నగర పరిధిలోని సుమారు 400 చర్చిలను అందంగా అలంకరించారు. అవన్నీ విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్నాయి. క్రిస్మస్ సందర్భంగా ఆయా చర్చిల చరిత్ర, ప్రస్తుత ఏర్పాట్లు, తదితర అంశాలను తెలుసుకుంటే ఈ పండగకు ఎంతటి ప్రాధాన్యత ఉందో ఇట్టే అర్థమవుతుంది. నగరంలోని బాప్టిస్టు, రోమన్ కేథలిక్ మేథాడిస్ట్, సెంట్ లూథరన్ వంటి డినామినేషన్‌కు చెందిన చర్చిల్లో క్రిస్మస్ వైభవంగా నిర్వహిస్తారు. క్రీస్తు చర్చి, సెవంత్‌డ్, లూథరన్ వంటి చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను భిన్నంగా ఆచరిస్తారు. నగరంలో ప్రముఖమైన, చారిత్రక ప్రసిద్ధి చెందిన లండన్ మిషన్ మెమోరియల్ బాప్టిస్టు, కల్వరి బాప్టిస్ట్, ట్రినిటీ ఇమ్మానియేల్‌ల్లో చర్చి ఆరాధన ప్రత్యేకంగా ఉంటుంది

పునీత పేతురు చర్చి

జ్ఞానాపురంలోని పునీత పేతురు ప్రధాన దేవాలయానికి 140 ఏళ్ల చరిత్ర ఉంది. పాత జ్ఞానాపురం ప్రాంతంలో ప్రస్తుత బిఇడి కళాశాల ఉన్న చోట తొలుత ఈ చర్చి ఉండేది. 13 సంవత్సరాల క్రితం ప్రస్తుత ప్రాంగణానికి తరలించారు. అప్పట్లో ఈ ప్రాంతంలో ఉన్న జనాభా అంతంతే. తొలి రోజుల్లో కేవలం 100 మంది విశ్వాసులు ఉండేవారు. జనాభాతో పాటు చర్చి ప్రాధాన్యత పెరుగుతూ వచ్చింది. చర్చి ఆధ్వర్యంలో సెయింట్ పీటర్స్ ఎలిమెంటరీ, ఉన్నత పాఠశాలలు ఏర్పాటయ్యాయి. చర్చి విశ్వాసుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం ఈ చర్చిలో ఏడు వేల మంది సభ్యులు ఉన్నారు. ఆదివారం అర్ధరాత్రి చర్చిలో క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి.

పురాతన ఎల్ఎంఎం ఆలయం

213 సంవత్సరాల చరిత్ర కలిగిన పురాతన ఆలయం లండన్ మిషన్ మెమోరియల్ చర్చి (ఎల్ఎంఎం)లో ఆదివారం అర్ధరాత్రి నుంచి క్రిస్మస్ వేడుకలను ప్రారంభించినట్లు చర్చి వైస్ చైర్మన్ కె.జాన్ విక్రమ్ తెలిపారు. కురుపాం మార్కెట్ రీడింగ్ రూంకు ఎదురుగా ఉన్న ఈ చర్చిలో క్రీస్తు జన్మదిన వృత్తాంతాన్ని తెలియజేయడానికి రెండు రోజుల పాటు కేరల్స్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి క్రిస్మస్ ఆరాధనలు ప్రారంభిస్తామన్నారు.

113 ఏళ్ల ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి

ఆంధ్రా నగరానికి తలమానికంగా నిలిచిన ఆంధ్ర బాప్టిస్ట్ చర్చికి 113 సంవత్సరాల చరిత్ర ఉంది. ఇది బాప్టిస్ట్ చర్చిల్లో అతి పురాతనమైనది. ఇక్కడ క్రిస్మస్ పండుగను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. క్రిస్మస్ రోజైన సోమవారం క్రీస్తు పుట్టుకను ప్రతిబింబించే విధంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఏసు క్రీస్తు పుట్టిన పశువుల పాక, క్రీస్తు పుట్టగానే జ్ఞానులకు మార్గాన్ని చూపించే తూర్పు నక్షత్రం వంటి అంశాలతో కూడిన లఘు నాటికలను ప్రదర్శించనున్నట్లు చర్చి నిర్వాహకులు తెలిపారు. క్రిస్మస్ తాత వేషధారణలో దుస్తులు ధరించి ప్రేమపూర్వకంగా ప్రతి ఒక్కరినీ పలుకరిస్తూ స్వీట్లు పంచిపెట్టనున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి ఇక్కడ క్రిస్మస్ ఆరాధనలు ప్రారంభమవుతాయన్నారు.

సెయింట్ ఆంథోనీ చర్చి

ఉత్తరాంధ్ర విశ్వాసుల ప్రధాన ప్రార్థన మందిరం సెయింట్ ఆంథోనీ చర్చి. పాత నగరం ప్రకాశరావుపేట వద్ద ఉన్న క్రిస్టియన్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో 1852లో చిన్న ప్రార్థనా మందిరాన్ని జెఎంఎం టి స్పాట్ ఫాదర్ నిర్మించారు. 1917లో ఫాధర్ గౌనెట్యార్ ఆధ్వర్యంలో కొత్త మందిరాన్ని విశాలంగా ఏర్పాటు చేశారు. దాదాపు 10-12 ఎకరాల విస్తీర్ణంలో చర్చితో పాటు ఉన్నత పాఠశాలను ప్రారంభించారు. 1934లో హౌస్‌ను ఇదే ప్రాంగణంలో నిర్మించారు. అందులో ఆర్చ్ బిషన్ నివాసముంటూ మూడు జిల్లాలకు చెందిన పరిపాలనా పనులను పర్యవేక్షించేవారు. కాలక్రమంలో నగరంలోని విశ్వాసులకు ఈ చర్చి ప్రధాన ప్రార్థనా మందిరంగా మారింది. నగర వాసులతో పాటు ఉత్తరాంధ్ర, తూర్పు గోదావరి జిల్లాల నుంచి వచ్చే క్రిస్టియన్లు కూడా ఈ చర్చిని సందర్శిస్తారు. క్రిస్మస్ సందర్భంగా ఈ చర్చిలో పశువుల శాలను నిర్మించారు. ఆదివారం అర్ధరాత్రి తర్వాత క్రీస్తు జనన ఘట్టాన్ని ప్రదర్శించారు.

నగరంలోని మరికొన్ని ప్రధాన చర్చిలు

పైన పేర్కొన్న చర్చలన్నీ చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకున్నవి కాగా నగరంలో మరికొన్ని చర్చిలు కూడా ఎంతో ప్రాముఖ్యతను పొందగలిగాయి. అటువంటి వాటిలో జగరాంబ జంక్షన్‌లోని లూథరన్ చర్చి, సిరిపురంలోని సెయింట్ పాల్ చర్చి, ఎంవిపి.కాలనీలోని ఇన్మానియేల్ లూథరన్ చర్చి, దొండపర్తిలోని బేతేలు చర్చి, రేసపువానిపాలెంలోని క్యూఎంబి చర్చి, అలాగే రామనగర్ అపోలో ఆసుపత్రి వెనుక రోడ్డులో ఉన్న బాప్టిస్టు చర్చి, గొల్లలపాలెంలోని బాప్టిస్టు చర్చి, తాటిచెట్లపాలెంలోని లూర్థు మాత చర్చి, సీతమ్మధారలోని బాల ఏసు చర్చి, ఎన్ఎడి జంక్షన్ లో ఉన్న బాప్టిస్టు చర్చి, ఎన్ఎడి ఎసిబి కాలనీలో ఉన్న సేవియర్ లూథరన్ చర్చి, అలాగే గాజువాక, స్టీల్ ప్లాంట్, గోపాలపట్నం, మురళీనగర్, అక్కయ్యపాలెం ప్రాంతాల్లో ప్రాధాన్యత కలిగిన చర్చిలు ఉన్నాయి. ఇవిగాక పాత నగరంలో రోజ్‌హిల్స్ పై ఉన్న మేరీ మాత ఆలయం కూడా చెప్పుకోదగినది. నగరంలోని ప్రముఖ చర్చిల్లో ఒకటిగా అల్లిపురం కల్వరి బాప్టిస్ట్ చర్చిని చెప్పుకోవొచ్చు. ఎల్ఐసి దరి అంబేద్కర్ సర్కిల్ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో ఉన్న కల్వరి బాప్టిస్టు చర్చిలో సోమవారం క్రిస్మస్ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు చర్చి చైర్మన్ పివి.ప్రసాద్ తెలిపారు. 75 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ చర్చిలో ఆరాధన కార్యక్రమం సంపూర్ణ బాప్టిస్టు సిద్ధాంతంలో నిర్వహిస్తారు. క్రీస్తు పుట్టుక, శాంతి సందేశాన్ని వినిపిస్తారు. అనంతరం సండే స్కూలు పిల్లలు క్రీస్తు పుట్టుక వృత్తాంతాన్ని నాటికల ద్వారా ప్రదర్శిస్తారు. ఈ చర్చిని అల్లిపురం సిబిఎం స్కూల్లో స్థాపించారు. 1962లో కల్వరి బాప్టిస్ట్ చర్చి పేరిట చిన్న రేకుల షెడ్డులో నడిపించారు. అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తూ 2005లో పక్కా భవనంగా మలిచారు. ప్రస్తుతం చర్చిలో ఆరు వేల మంది సభ్యులు ఉన్నారు.

విద్యుత్ వెలుగుల్లో మెరిసిపోతున్న నగరంలోని ఓ చర్చి

కలెక్టర్, మేయర్ క్రిస్మస్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అందరికీ విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి వేర్వేరు ప్రకటనల్లో ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు గొప్ప మహనీయుడు, శాంతి దూత అని పేర్కొన్నారు.

పుంగనూరు చరిత్ర పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆంధ్రుల చరిత్రలో అంతర్లీనంగా డాక్టర్ ఎం.రామచంద్రారెడ్డి రాసిన 'పుంగనూరు చరిత్ర.. నాతో నేను' పుస్తకాన్ని ఆదివారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో ఆవిష్కరించారు. అంబేద్కర్ యూనివర్సిటీ (శ్రీకాకుళం) మాజీ విసి ఆచార్య హనుమంతు లజపతిరాయ్ ముఖ్యఅతిథిగా హాజరై తొలి కాపీ పుస్తకాన్ని అంతర్మథనం రచయిత డాక్టర్ డివి.సూర్యారావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 90 ఏళ్లలోనూ శ్రమించి డాక్టర్ డి.రామచంద్ర రెడ్డి ఆయన జన్మించిన పుంగనూరు చరిత్రను పుస్తక రూపంలో రాసి విస్తృతపరచడం ఆదర్శనీయమన్నారు. శ్రీశ్రీ నడయాడిన విశాఖలో రామచంద్రారెడ్డితో ఉన్న తత్సంబంధం మేరకు ఇక్కడ పుస్తకాన్ని ఆవిష్కరించినట్టు చెప్పారు. కార్యక్రమంలో రామచంద్ర రెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్య రెడ్డి, డాక్టర్ లక్ష్మీ సంగీత, ఐటి మార్కెటింగ్ హెడ్ సురేష్ బాబు పాల్గొన్నారు.

ఎయు స్నాతకోత్సవం వాయిదా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ఆంధ్ర విశ్వవిద్యాలయం 91-92 సంయుక్త స్నాతకోత్సవం వాయిదా పడినట్లు రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తెలిపారు. ఈ నెల 30వ తేదీన జరగవలసిన సంయుక్త స్నాతకోత్సవం వాయిదా పడిందని, తిరిగి ఎప్పుడు నిర్వహించేదీ త్వరలో వెల్లడిస్తామని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

27న మేధావుల సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఈ నెల 27న తలపెట్టిన సదస్సును జయప్రదం చేయాలని అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి ఆంధ్రప్రదేశ్ కమిటీ చైర్మన్ ఆచార్య హనుమంతు లజపతిరాయ్ కోరారు. డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 27న అనంతపురం లలితా కళాపరిషత్తు ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు ఈ మేధావుల సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీదరి అప్పలరాజు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.చైతన్య రెడ్డి, డాక్టర్ లక్ష్మీ సంగీత, ఐటి మార్కెటింగ్ హెడ్ సురేష్ బాబు పాల్గొన్నారు.

ముగింపు దశలో రైతుబజారు నిర్మాణం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి చొరవతో ఎట్టకేలకు సాకారం

హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు, వినియోగదారులు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు పరిధిలో రైతు బజారు నిర్మాణ పనులు చురుగ్గాసాగి చివరి దశలో ఉన్నాయి. 1837.82 చదరపు గజాల విస్తీర్ణంలో మార్కెటింగ్ శాఖ నిధులు రూ.78 లక్షలతో 50 దుకాణాల సముదాయాలతో రైతు బజారును నిర్మిస్తున్నారు. ఏనాటి నుంచో ఇక్కడ రైతు బజారు నిర్మించాలని ప్రభుత్వ పెద్దలు ఆలోచనలు చేస్తూనే ఉన్నారు ఎట్టకేలకు ఇది సాకారమై, దాదాపు రైతు బజారు నిర్మాణం పూర్తికావచ్చిందనే చెప్పాలి.రైతు బజారు నిర్మాణం పూర్తయితే భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల రైతులు తమ పంటలను గిట్టుబాటు ధరకు అమ్ముకోవచ్చు. దళారీల బెడద తప్పుతుంది.

2019 లోనే రైతు బజారు మంజూరైనప్పటికీ, మార్కెటింగ్ శాఖకు స్థలం అప్పగింతలో జివిఎంసి,కొంత మేర జాప్యం జరగడంతో దాదాపు మూడేళ్లకుపైగా నిర్మాణ పనుల్లో ఎటువంటి కదలిక లేదనే చెప్పాలి. ఈ క్రమంలో రైతు బజారు నిర్మాణంపై ఒకింత సందిగ్ధత నెలకొంది. రైతు బజారు ఏర్పాటవుతుందా? లేదా? అని రైతుల్లో అయోమయం నెలకొంది. ఎట్టకేలకు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో రైతు బజారు నిర్మాణం ప్రారంభమై నేడు తుదిదశకు చేరింది. దీన్ని త్వరితగతిన పూర్తి చేసి, ప్రారంభించడం ద్వారా రైతు బజారు సేవలను రైతులు, వినియోగదారులకు అందుబాటులోకి తెస్తే అందరికీ ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు అంటున్నారు.

నిర్మాణంలో ఉన్న రైతు బజారు

స్థానిక సమస్యలనడిగి తెలుసుకుంటున్న ఎంవివి సత్యనారాయణ

13వ వార్డులో గడపగడపకు...

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యాన నిర్వహించారు. విశాఖ ఎంపీ, తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎంవివి సత్యనారాయణ హాజరయ్యారు. ఆరిలోవ కాలనీ ఎఎస్ నగర్, సాయినగర్, శివ శంకర్‌నగర్, శివాజీనగర్ -1, భగత్‌సింగ్ నగర్, ప్రగతి నగర్, జైభీమ్ నగర్ ప్రాంతాల్లో వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. స్థానికుల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సత్యనారాయణ, మొల్లి అప్పారావు పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనలో కెజిబివి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం నేలతేరు గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం విద్యార్థులు ఈ నెల 21, 22న భోపాల్‌లో జరిగిన జాతీయస్థాయి నృత్య ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రత్యేక అధికారి చంద్రకళ తెలిపారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి బాలరంగ్ నృత్య ప్రదర్శనలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు 15 మంది విద్యార్థులు ఎంపికై అక్కడ కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుచుకున్నారని పేర్కొన్నారు. సమగ్ర శిక్ష ఎపిసి బి.శ్రీనివాసరావు, జిసిడిఒ ఎస్‌కె.కలిసాబేగం, బాలరంగ్ కో-ఆర్డినేటర్ శారదా దేవి ఆధ్వర్యాన విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను చంద్రకళ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆక్రమణలను తొలగిస్తున్న జెసిబి

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి -పిఎం పాలెం : జివిఎంసి ఆరో వార్డు పరిధి కొమ్మాది జవహర్ నవోదయ విద్యాలయం సమీపంలోని సర్వే నెంబర్ 153/2 లోని గెడ్డ వాగు స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను చినగదిలి రెవెన్యూ అధికారులు ఆదివారం జెసిబి సహాయంతో తొలగించారు. సుమారు రెండు వందల గజాల స్థలాన్ని చదును చేసి నిర్మాణం చేపట్టిన సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు ఆదివారం తొలగించి రూ.కోట్లు విలువచేసే ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల విఆర్ఒ శ్రీనివాస్, సచివాలయ విఆర్ఒ శ్రీను, విఆర్ఎ బంగారు రాజు, శ్రీను పాల్గొన్నారు.

యువజన విభాగం అధ్యక్షునిగా మూర్తిబాబు

ప్రజాశక్తి -పిఎం పాలెం : జివిఎంసి ఆరో వార్డు వైసిపి యువజన విభాగం అధ్యక్షునిగా పి.ఎం.పాలేనికి చెందిన పోతిన మూర్తిబాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా పోతిన మూర్తిబాబు మాట్లాడుతూ, తనకు ఈ బాధ్యతను అప్పగించినందుకు పార్టీ అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు, ఆరో వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి లక్ష్మీప్రియాంకకు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాబోయే ఎన్నికల్లో వైసిపి విజయానికి కృషి చేస్తానన్నారు. యూత్ అధ్యక్షునిగా పోతిన మూర్తిబాబు నియామకం పట్ల పలువురు వైసిపి అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

ఎగువపేటలో అన్నదానం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధి ఎగువపేటలోని శ్రీ పోలమాంబ నెల పండగ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆదివారం అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ ఇంఛార్జి ముత్తంశెట్టి మహేష్, టిడిపి నియోజక వర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు, జనసేన కన్వీనర్ పంచకర్ల సందీప్ తది తరులు పాల్గొన్నారు. సంఘం అధ్యక్షులు గంటా నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నరసింగరావు, కార్యదర్శి వాసుపల్లి కొండబాబు తదితరులు అతిథులకు జ్ఞాపికలు అందించి, శాలువాలతో సత్కరించారు.

సందీప్‌తో భువనేశ్వరి భేటీ

ప్రజాశక్తి -తగరపువలస : ఎండాడలో ఉన్న జనసేన కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పంచకర్ల సందీప్‌తో పార్టీ జివిఎంసి ఒకటో వార్డు అధ్యక్షులు పరిమి భువనేశ్వరి ఆదివారం భేటీ అయ్యారు. పలు రాజకీయ పరమైన అంశాలతో పాటు ప్రజా సమస్యలపై చర్చించినట్లు భువనేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

29 మంది రక్తదానం

ప్రజాశక్తి- ఆనందపురం: ఒఎస్‌జి ఫౌండేషన్, వెంపాడ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యాన విజయశ్రీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఆదివారం ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ ఒఎస్‌జి ఆర్య స్టూడియో వద్ద రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి స్థానికులు, విద్యార్థులు స్వచ్ఛందంగా వచ్చి 29 మంది రక్తదానం చేశారు. ఒఎస్‌జి ఫౌండేషన్‌కు ఇది 33వ రక్తదానం శిబిరం కాగా గతం నుంచి ఇప్పటి వరకు 1852 యూనిట్లు రక్తం సేకరించారు. ఈ రక్తాన్ని రోడ్డు ప్రమాదాలు, గుండె సంబంధిత వ్యాధులు, కేన్సర్, తలసేమియా పిల్లలకు అందిస్తామని ఒఎస్‌జి ఫౌండేషన్ ప్రతినిధి శివ దళాయి తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయశ్రీ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు, ఒఎస్‌జి ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ ఉమామహేశ్వర్, సెక్రటరీ చంద్రశేఖర్, సురేష్, ఆర్య భాస్కర్, పండు, సునీల్, గోవింద్, వెంపాడ వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆర్‌ఎంపిల సేవలు అవసరం'

ప్రజావేదికలో మాట్లాడుతున్న ఆర్‌ఎంపిల ప్రతినిధి

ప్రజాశక్తి-ఆనందపురం: గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపిల సేవలు ఎంతో అవసరమని ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు జంగం జోషి చెప్పారు. మండలంలోని వెల్లంకిలో స్థానిక గ్రామీణ వైద్యులు పచ్చిపులుసు కనకారావు సహకారంతో ఆర్‌ఎంపిల ఆవశ్యకతపై ప్రజావేదికను అదివారం నిర్వహించారు. ఈ సభకు ఆర్‌ఎంపి రాష్ట్ర ఫెడరేషన్ ముఖ్య సలహాదారులు, ఐఎంఎ ప్రతినిధి డాక్టర్ ఎన్‌ఎల్.రావు హాజరై ప్రజల స్పందనను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జంగం జోషి మాట్లాడుతూ, 60 ఏళ్లకు పైగా గ్రామాలోల ఆర్‌ఎంపిలు వైద్యసేవలు అందిస్తున్నారని, వీరి సేవలను గుర్తిస్తూ ఇటీవల ప్రభుత్వం జిఒ 429ను జారీ చేసినా, అమలులో పారదర్శకత లోపించిందన్నారు. ఆర్‌ఎంపిలకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్యానికి అర్హత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత విఆర్ఒ కె.దామోదర్‌రావు, ప్రసాద్ పట్నాయక్, ఎన్.సుగుణేశ్వరి, పోతిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పడాల వినోద్ కుమార్, కె.ఎన్.రావు, గోట్టుముక్కల రఘుబాబు, పడాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోవిడ్ నేర్పిన కార్పొరేట్ పాఠాలపై గ్రంథం

గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న నాగేంద్రప్రసాద్ తదితరులు

ప్రజాశక్తి-మధురవాడ : కోవిడ్-19 మహమ్మారి వల్ల ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాలలో వచ్చిన మార్పులు, సంక్షోభం నేర్పిన పాఠాలపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తరణ్ దొల్లా రచించిన గ్రంథాన్ని ఆదివారం గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ నాగేంద్రప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రంథ రచయిత డాక్టర్ తరుణ్ మాట్లాడుతూ, కోవిడ్-19 నేపథ్యంలో ప్రపంచ దేశాలలో ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు కలిసి పనిచేసిన విధానం, ఫలితాలు, వైద్య ఆరోగ్య సదుపాయాలు, రవాణా, కమ్యూనికేషన్ రంగాలు ఏ విధంగా ప్రభావితం అయింది వివరిస్తూ భవిష్యత్తులో వ్యూహాత్మకంగా ఎలా వ్యవహరించాలో సూచించినట్లు తెలిపారు. ఈ గ్రంథాన్ని ప్రఖ్యాత ప్రచురణ సంస్థ స్ప్రింగర్ నేచర్ ప్రచురించింది. గీతం సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ డి.ముకుంద్ తదితరులు గ్రంథావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని రచయితను అభినందించారు.

దక్షిణ మండల టెన్నిస్ పోటీలకు గీతం జట్టు

టెన్నిస్ పోటీలకు ఎంపికైన గీతం క్రీడాకారులు

ప్రజాశక్తి-మధురవాడ : అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఎఐయు) ఆధ్వర్యాన ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో జరగనున్న దక్షిణాది రాష్ట్రాల విశ్వవిద్యాలయాల పురుషుల (సౌత్‌జోన్) టెన్నిస్ పోటీలకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం జట్టును ఎంపిక చేసినట్లు క్రీడా విభాగం డైరక్టర్ డాక్టర్ యు.విజయకుమార్ తెలిపారు. జట్టు మేనేజర్‌గా గీతం క్రీడా విభాగం డిప్యూటీ డైరక్టర్ ఎస్.శ్రీనివాస్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు. గీతం జట్టుకు కెప్టెన్‌గా వి.గౌతమ్ వ్యవహరిస్తారని, సభ్యులుగా పిబి.శ్రీకార్తిక్, ఎన్.కుసాల్‌వర్మ, కె.శ్రీరంగరిషిత్, కె.నాగసాయి వెంకట రోహిత్ ఎంపికయ్యారని తెలిపారు. 27వ తేదీన మొదటి పోటీ హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం జట్టుతో గీతం జట్టు తలపడనుందని పేర్కొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ పిఎన్.రావు

29న విటి స్కూల్ 77 వసంతాల సంబరాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : విటి స్కూల్ 77వ వసంతాల సంబరాలను ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ పి.ఎన్.రావు తెలిపారు. స్కూల్ ఆవరణలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విటి స్కూల్‌ను 1946లో ప్రారంభించినట్లు తెలిపారు. గడిచిన 77 సంవత్సరాలుగా వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్ది సమాజానికి అందించామన్నారు. తమ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్నత స్థానాల్లో స్థిరపడటం తమకు సంతోషాన్ని ఇస్తుందన్నారు. తమ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందరికీ చేరువచేస్తున్నామని తెలిపారు. సంబరాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై చిన్నారుల ప్రతిభను వీక్షించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ సివి.రావు, సీనియర్ న్యాయవాది టివి.నారాయణరావు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.లక్ష్మి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వర్మకు అభినందనలు తెలుపుతున్న వైసిపి నాయకులు

వర్మకు అభినందనలు

ప్రజాశక్తి-వేపగుంట : పెందుర్తి జివిఎంసి క్లస్టర్-1 వైసిపి యువజన విభాగం అధ్యక్షునిగా నియమితులైన నాయడుతోటకు చెందిన ఎం.కార్తీక్‌సంపత్‌వర్మను నాయకులు అభినందించారు. జివిఎంసి 93వ వార్డు పరిధి కృష్ణానగర్‌లోని వేదిక పంక్షన్ హాల్లో వైసిపి నాయకులు అభినందన సభ ఏర్పాటుచేశారు. వైసిపి నగర అధికార ప్రతినిధి యతిరాజుల నాగేశ్వరరావు, 94వ వార్డు అధ్యక్షుడు తామర్ల నర్సింగరావు, 93వ వార్డు అధ్యక్షుడు బండి సత్య బాలు తదితరులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా యతిరాజుల నాగేశ్వరరావు మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో వైసిపి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, వినోద్, రామకృష్ణ, ఈశ్వరరావు, విరాట్‌నగర్ రమేష్, జిలాని, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

వైసిపి నేతల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 93, 94 వార్డుల వైసిపి నాయకుల ఆత్మీయ సమావేశం ఆదివారం కృష్ణానగర్‌లోని వేదిక పంక్షన్ హాల్లో నిర్వహించారు. గడిచిన నాలుగున్నరేళ్లలో 93, 94 వార్డుల్లో జరిగిన అభివృద్ధి పనులు, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు నుంచి సహాయ సహకారాలు ఎలా ఉన్నాయి.., ప్రజలు సంతృప్తిగా ఉన్నారా.., అసంతృప్తిగా ఉన్నారా అన్న అంశాలపై వైసిపి నగర అధికార ప్రతినిధి యతిరాజుల నాగేశ్వరరావు, నాయకులు తామర్ల నర్సింగ్, బండి సత్తిబాబు, కాంతమ్మ, ఈశ్వరరావు, వినోద్, విరాట్‌నగర్ రమేష్ తదితర నాయకులు చర్చించారు. తమకు సంతృప్తికరంగా లేదని, ఎమ్మెల్యే నుంచి ఆశించినంత సహాయ సహకారాలు అందలేదని వారంతా అసంతృప్తి వ్యక్తంచేశారు. రానున్న రోజుల్లో 93, 94 వార్డుల్లో వైసిపిని అభివృద్ధి చేసేలా ఎమ్మెల్యేపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, కార్తీక్‌వర్మ, జిలాని, రామకృష్ణ, రాము, కడియం సత్తిబాబు, చిన్న శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గెడ్డల పరిరక్షణకు సమిష్టి కృషి

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖలో సహజసిద్ధమైన నీటి గెడ్డల పరిరక్షణకు ప్రభుత్వం, పౌర సమాజం సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని గ్రేటర్ విశాఖపట్నం సిటిజన్స్ ఫోరం (జివిసిఎఫ్) ప్రతినిధులు పేర్కొన్నారు. విశాఖ పౌర గ్రంథాలయంలో 'విశాఖపట్నంలో నీటి గెడ్డలు- సమస్యలు, పరిష్కార మార్గాలు' అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. విశాఖలో సహజ నీటి ప్రవాహ వ్యవస్థల సుస్థిర యాజమాన్యం అనే అంశంపై సదస్సులో ప్రముఖ ఆర్కిటెక్ట్ షబ్బం పటేల్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. విశాఖలో సహజమైన నీటి కాలువలు (గెడ్డలు) సముద్రంలో కలుస్తాయని, ఈ ప్రక్రియ వర్షాల సమయంలో నగర ప్రకృతి దృశ్యాన్ని పొడిగా ఉంచడంలో సహాయపడుతుందని చెప్పారు. పెరుగుతున్న జనాభా సాంద్రత, పట్టణీకరణ కారణంగా తుపాను నీటి కాలువలు నేడు వ్యర్థ కాలువలుగా మారాయని వివరించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నరేష్ కుమార్, మాజీ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.బాల్మోహన్‌దాస్, లెఫ్టినెంట్ కల్నల్ ఎకె.సుబ్బారావు, సోహన్ హటంగడి, కెప్టెన్ ఎన్. విశ్వనాథన్, ఎన్‌వి.సుబ్రహ్మణ్యం, కె. కామరాజు, కెప్టెన్ కెఎస్ఎన్ నాయుడు, ఎ.రమేష్, ఎన్.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గెడ్డలు ద్వారా సముద్రంలో చేరే వ్యర్థాల పరిమాణాన్ని తక్షణమే తగ్గించాల్సిన అవసరం ఉందని,వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రధాన మౌలిక సదుపాయాల పెట్టుబడులకు సమాంతరంగా నీటి గెడ్డల వ్యవస్థను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని, సముద్రంలోకి విడుదలయ్యే ముందు మురుగునీటిని శుభ్రపరిచే విషయంలో అత్యంత ప్రాధాన్యతనివ్వాలని తీర్మానాలు చేశారు.

సమైక్య అపార్ట్‌మెంట్‌లో రక్త పరీక్షలు

ప్రజాశక్తి -గాజువాక : తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన అపార్ట్‌మెంట్‌లో ఆదివారం వివిధ రకాల రక్త పరీక్షలు నిర్వహించారు. గాజువాక క్లియర్ యు డయాగ్నస్టిక్ సౌజన్యంతో గ్రీన్ లైఫ్, సిరి, స్వర్ణ సాయి, సమైక్య అపార్ట్‌మెంట్‌లో 25 కుటుంబాలకు రక్త పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సమైక్య అపార్ట్‌మెంట్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ బి.తౌడన్న, జాయింట్ సెక్రెటరీ కె.చెన్నంనాయుడు, శ్రీనివాస్‌చౌదరి, దొర, మహిళా కమిటీ అధ్యక్షులు మనీ, సెక్రటరీ స్వప్న, గ్రీన్ లైఫ్ అపార్ట్‌మెంట్ ఏ బ్లాక్ సెక్రెటరీ నారాయణరావు, డయాగ్నస్టిక్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్త పరీక్షల శిబిరం వద్ద హాజరైన అసోసియేషన్ నాయకులు, వైద్య సిబ్బంది

అసోసియేషన్ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి -మాధవధార : హార్బర్ అండ్ పోర్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అభివృద్ధికి కృషిచేస్తున్నానని అసోసియేషన్ ఛైర్మన్ సనపల బంగారురాజు తెలిపారు. మాధవధార తోటల్లో అసోసియేషన్ ఆధ్వర్యాన వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా సనపల బంగారురాజును అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా బంగారురాజు మాట్లాడుతూ, అసోసియేషన్ సభ్యుల సంక్షేమానికి కృషిచేస్తానన్నారు. అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ సిహెచ్ మసేన్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల పింఛన్‌దారులు రోడ్డున పడుతున్నారన్నారు. విశాఖపట్నం పోర్టును ముక్కలుగా చేసి ప్రైవేటుపరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. భవిష్యత్తులో పింఛన్ లేకుండా చేసేందుకు పోర్టు యాజమాన్యం యత్నిస్తుందని వివరించారు. ఈ చర్యలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పోర్టు హాస్పిటల్ స్థలాన్ని కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా అమ్మేస్తున్నారన్నారు. దీనివల్ల వైద్యం కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్తుందని, పింఛన్‌దారులపై భారం పడుతుందని తెలిపారు. తక్షణమే వీటిని వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి అప్పారావు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నెపు నారాయణరావు, కార్యదర్శి పిఎన్.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

బంగారురాజును సన్మానిస్తున్న హార్బర్, పోర్టు వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

సన్మానాలు బాధ్యతను పెంచుతాయి

అండిబోయిన లక్ష్మిని సన్మానిస్తున్న రాంబాబు తదితరులు

ప్రజాశక్తి -గాజువాక : సన్మానాలు బాధ్యతను పెంచుతాయని విశాఖపట్నం బార్ అసోసియేసన్ అధ్యక్షులు చింతపల్లి రాంబాబు అన్నారు. జివిఎంసి 72వ వార్డు పరిధి వినాయకనగర్‌లో హైకోర్టు న్యాయవాది, ఏపీ యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మిని ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేషనల్ స్థాయిలో యోగాలో అండిబోయిన లక్ష్మి గోల్డ్ మెడల్ సాధించడమే కాకుండా రాజకీయంగా అభివృద్ధి చెందుతూ యాత కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఉన్నారన్నారు. గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి అభివృద్ధికి కృషిచేస్తున్నారని తెలిపారు. నవ్య చేతన మహిళా సేవా సంఘం ద్వారా ఎంతో మంది పేదలకు సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సంపంగి బన్నీ, గుడిపూడి సుబ్బారావు, తొంట భుజంగరావు, యాత, శెట్టిబలిజ, గౌడ, ఈడిగ, శ్రీశైన సంక్షేమ సంఘం అధ్యక్షులు అండిబోయిన అప్పారావు, వనము నాగేశ్వరరావు, మల్లెల సూర్యనారాయణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చందు

వడ్లపూడిలో వైసిపి కార్యకర్తల సమావేశం

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 87వ వార్డు పరిధి వడ్లపూడిలో వైసిపి కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గాజువాక నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఉరుకూటి చందు మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పేదల జీవితంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెలుగులు నింపుతున్నారన్నారు. ఈ సమావేశంలో ప్రగడ గోవిందరాజులు, వండ్రాసి వెంకటరావు, కోనేటి పరిపాల్లి, బెల్లంకొండ, పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

బ్యాటింగ్ చేస్తున్న ఆనంద్‌కుమార్

యువకులు లక్ష్యంతో ముందుకు సాగాలి

ప్రజాశక్తి -ములగాడ : యువకులు ఒక లక్ష్యాన్ని పెట్టుకొని ముందుకు సాగాలని పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పిలుపునిచ్చారు. విశాఖ వెస్ట్ క్రికెట్ లీగ్‌లో భాగంగా ఆదివారం హిందుస్తాన్ షిప్ యార్డు గ్రౌండ్‌లో నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌ను ఆడారి ఆనంద కుమార్ సందర్శించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. గ్రౌండ్ ఏ విధంగా ఉంది.., గ్రౌండ్‌లో ఏర్పాట్లు, సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, యువత అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, జాబ్స్ ఫెయిర్ సలహాదారుడు గాది శ్రీధర్ రెడ్డి, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కలిదిండి బద్రీనాథ్, అంగ రాంప్రసాద్, కార్పొరేటర్లు, మండల పార్టీ ప్రెసిడెంట్లు, జెసిఎస్ క్లస్టర్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీనగర్‌లో ఉన్న ఆనందమార్గ్ ఆశ్రమంలో ఆదివారం సాయంత్రం 200 మంది పేదలకు ఆనంద మార్గ ఆచార్య సౌమ్యానంద అవధూత, సంస్థ సభ్యులు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆచార్య సౌమ్యానంద అవధూత మాట్లాడుతూ, ఏటా శీతాకాలంలో వివిధ ప్రాంతాల్లో దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు హోమియో, ఆయుర్వేదిక్ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని స్థానిక ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

సుందరయ్యపేటలో సమస్యలు వింటున్న రత్నాకర్

ప్రజాశక్తి- కశింకోట : మండలంలో సుందరయ్యపేట పంచాయతీ పరిధిలోని ఆనందపురం నాయుడుపాలెం, చిన్నయ్యపాలెం, కొత్తూరు, వెంకన్నపాలెం గ్రామాలలో సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని వైసిపిపార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. ఆదివారం ఆయా గ్రామాల్లో పర్యటించారు. ముందుగాభూలోకమాంబ అమ్మవారిని, ఆంజనేయస్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆనందపురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న మరిడిమాంబ ఆలయాన్ని పరిశీలించారు. సుందరయ్యపేటలో సర్పంచ్ బండారు వాసు, మాజీ సర్పంచ్ రాయవరపు ప్రకాషరావు ఆధ్వర్యంలో గ్రామాల పెద్దలతో సమావేశం నిర్వహించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో తాగునీరు, రోడ్లు,డ్రైనేజీ, ఇతరత్రాసమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు రత్నాకర్‌కు విన్నవించారు ఆనందపురం చెరువులో రెండు పెద్ద మోటార్లను ఏర్పాటు చేసి చెరువులను నీటితో నింపడం ద్వారా సాగునీటికి ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు వివరించారు. సమగ్ర భూ సర్వేలో తప్పులు, అవకతవకలతో ముందుముందు రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి తప్పదని ఆవేదన వెలిబుచ్చారు. ఆయా సమస్యలపై స్పందించిన రత్నాకర్, వాటి పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో రుత్తల నాయుడుబాబు, కరక వెంకన్న, బీఎస్ నాయుడు, రేఖా నాగరాజు, రేఖా లక్ష్మణరావు, కరక ఎర్రినాయుడు, ఆర్.పైడిరాజు, రొంగలి సత్యనారాయణ, యువకులు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు ఆపకుంటే ఉద్యమం

ప్రాజెక్టు పనులు పరిశీలిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని చింతలపూడి పంచాయతీ శివారు బలిపురం సమీపంలో అదాని కంపెనీ నిర్మిస్తున్న హైడ్రో పవర్‌ప్లాంట్ పనులు వెంటనే నిలుపుదల చేయాలని మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి పి.వి.జి.కుమార్ అన్నారు. ఆదివారం సాయంత్రం బలిపురం సమీపంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. రైవాడ రైతులకు, రైవాడ జలాశయానికి ఇంత అన్యాయం జరుగుతున్నా, స్థానిక మంత్రి కనీసం స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఈ పవర్ ప్లాంట్ నిర్మాణం వలన గిరిజన, ఆయకట్టు రైతులకు కష్టాలు తప్పవన్నారు.

స్థానిక ప్రజలకు ముఖ్యంగా గిరిజనులకు, రైతులకు తీవ్రనష్టం కలిగించే ప్రాజెక్టుకు రాష్ట్రకేబినెట్ ఆమోదించినప్పుడు, తర్వాత ఇప్పుడైనా ఉపముఖ్యమంత్రి నోరు మెదపకపోవడంపై మండిపడ్డారు. తక్షణమే పనులు నిలుపుదల చేయకుంటే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో కర్రి సింహాద్రి నాయుడు, బండారు రామారావు, దొగ్గ దేముడు నాయుడు, చల్లా నానాజీ, జూరెడ్డి రాము, గొర్లి దేముళ్ళు, ముక్క ఈశ్వరరావు, తేడా చిన్నా పాల్గొన్నారు.

ఆసరా సాయానికి బయోమెట్రిక్ నమోదు

ప్రజాశక్తి -కశింకోట: డ్వాక్రా మహిళలకు నాలుగో విడత ఆసరా రుణ మాఫీకి బయోమెట్రిక్ నమోదు చేసుకోవాలని మండల మహిళా సమాఖ్య సిబ్బంది కోరుతున్నారు. ఈమేరకు లబ్ధిదారులైన మహిళల బ్యాంక్ ఖాతా నెంబర్ , సెల్ నెంబర్లతో సంఘం సభ్యులున్న సిఎల వద్ద నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు.దీనిపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తూ బయోమెట్రిక్ నమోదు చేస్తున్నారు.

గిరిజనుల సంక్షేమానికి ప్రాధాన్యం

నేరెళ్లపూడి రోడ్డు నిర్మాణానికి ఉపముఖ్యమంత్రి బూడి శంకుస్థాపన

శంకుస్థాపన చేసేందుకు గెడ్డలో దిగి వెళుతున్న ఉపముఖ్యమంత్రి

ప్రజాశక్తి- దేవరాపల్లి : గిరిజనుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి, బూడి ముత్యాల నాయుడు అన్నారు. ఆదివారం చింతలపూడి గిరిజన పంచాయతీ శివారు సమ్మెద గ్రామం నుండి బోడిగరువు మీదుగా నేరెళ్లపూడి వరకు రెండు కోట్ల రూపాయలతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. థింసా నత్యాలతో గిరిజనులు మంత్రికి ఘనస్వాగతం పలకగా, వారితో కలిసి డిప్యూటీ సిఎం బూడి డాన్స్ చేశారు. రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనకు కాలినడకన వెళ్లిన ఉపముఖ్యమంత్రి అక్కడ గెడ్డనీటిలో దిగి నడిచివెళ్లారు.

ఈ సందర్భంగా బూడి మాట్లాడుతూ బోడి గురువు మూడు నియోజకవర్గాలకు కేంద్ర బిందువుగా ఉందని, ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే మాడుగుల నియోజకవర్గంలో పాటు అరకు ఎస్.కోట నియోజకవర్గాల ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మట్టి రోడ్డు నిర్మాణం పూర్తయిన వెంటనే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఒప్పించి మరో మూడున్నర కోట్లతో నిధులు మంజూరు చేయించి తారు రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జడ్పీటీసీ కర్రి సత్యం, యువజన విభాగం అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, కొప్పల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలం నాయుడు, తామరబ్బ చింతలపూడి సర్పంచ్లు టోకూరు రామకష్ణ, దమ్మంగి బోడెమ్మ, ఎంపీటీసీ బండి గౌరమ్మ, ఏపీ వైయస్సార్ జిల్లా టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు శిరికి శ్రీనివాస రావు, ఎంపీడీవో సిహెచ్ సుబ్బలక్ష్మి, తాసిల్దార్ ఎం లక్ష్మి, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు గొర్లెపోటు రమాదేవి, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే అక్రమ అరెస్టులు

మాట్లాడుతున్న నాగ జగదీష్

టిడిపి జిల్లా అధ్యక్షుడు నాగ జగదీష్

ప్రజాశక్తి- అనకాపల్లి : లోకేష్ యువగళం పాదయాత్ర ముగింపు సభకు ఐదు లక్షల పైబడి ప్రజలు రాకతో సిఎం జగన్ రెడ్డికి భయం పట్టుకుందని టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. ఆదివారం స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. జగన్‌రెడ్డి సంతోషానికి అక్రమ కేసులో లోకేష్‌ను ఇరికించి అరెస్టు చేయాలన్న సిఐడి ప్రయత్నాలను హైకోర్టు బ్రేకులు వేసిందన్నారు. సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకూడదని, అరెస్టులు చేయొద్దని సుప్రీం కోర్ట్ చెప్పినప్పటికీ జగన్ రెడ్డి ఆదేశాలతో ఎన్ఆర్ఐ యాష్‌కు లుక్ ఔట్ నోటీసులు ఇచ్చి శంషాబాద్ విమానాశ్రయములో అక్రమంగా అరెస్టు చేసి గుంటూరుకు తరలించడంపై కోర్టు మొట్టికాయలు వేసిందన్నారు. 41 నోటీస్ ఇచ్చి విచారణ చేయాలని కోర్టు ఆదేశించిందన్నారు. హైకోర్టు న్యాయమూర్తులపై సోషల్ మీడియాలో పత్రికల్లో విమర్శలు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని కోర్టు ఆదేశించినా బేఖాతరు చేసిన సిఐడి, ఇపుడు జగన్ ఆదేశాలతో విపక్షాలపై చిన్నకేసుల్లోనూ అరెస్ట్ చేసి వేధింపులకు పాల్పడడం శోచనీయమన్నారు. అవినీతి కేసుల్లో 16 నెలలు జైలులో ఉన్న జగన్ రెడ్డి, ప్రత్యర్థులను జైల్లో ఉంచాలని కక్షపూరిత చర్యలకు సిఐడి, అధికారులు అండగా ఉండడం విచారకరమన్నారు.ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగులు, అన్ని వర్గాలు ఉద్యమబాట పట్టాయని, ఎన్నికల్లో ఎన్ని పార్టీలు కలిసొచ్చినా తమకు భయం లేదని గొప్పలకు పోతున్న వైసిపి నేతలు, తెలుగుదేశం జనసేన కూటమి చూసి భయపడుతున్నారని వ్యాఖ్యానించారు. నియంత జగన్‌కు బుద్ధి చెప్పే రోజుల దగ్గర పడ్డాయని నాగ జగదీష్ అన్నారు. సమావేశంలో పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు గుర్రం నూకరాజు జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి రేసుపూడి రమణ జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి విల్లూరి రమణబాబు పాల్గొన్నారు.

అభాగ్యులకు 250 రగ్గుల పంపిణీ

రగ్గులు పంపిణీ చేస్తున్న రత్నాకర్

ప్రజాశక్తి -అనకాపల్లి : రోడ్డు పక్క చలిలో మగ్గిపోతున్న యాచకులు, అభాగ్యులకు రక్త చైతన్యకర్త, రాష్ట్ర ప్రాణదాత సేవా పురస్కార్ అవార్డ్ గ్రహీత కొమ్మోజు గణేష్ ఆధ్వర్యంలో అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో 250మందికి రగ్గులు పంపిణీ చేశారు. అనకాపల్లి పట్టణంలో వైసీపీ పార్లమెంటరీ పరిశీలకులు దాడి రత్నాకర్ పాల్గొని, రోడ్డుపక్కన చలితో ఇబ్బందులు పడుతున్న పలువురికి రగ్గులను అందజేశారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ యువత సేవా కార్యక్రమాలలో పాల్గొని ఇలాంటి మంచి పనులు చేయాలన్నారు. అవసరమైతే తాను సాయం చేసేందుకు సిద్ధమని భరోసానిచ్చారు. ఏటా అభాగ్యులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కొమ్మోజు గణేష్, ఇతర వాలంటీర్లను అభినందించారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ రేబాక మధుబాబు, 81వ వార్డ్ కార్పొరేటర్ కొణతాల నీలిమభాస్కర్, నారాయరావు, ఉప్పల సాయి, రెడ్‌క్రాస్ కోర్డినేటర్ కోటేశ్వరరావు, ఉదయ్, జయంత్, ఫణి , దుర్గారావు, రాజు, నాగ శ్రీను, వైసిపి నేతలు రేబాక ఇంద్ర కుమార్, విల్లూరి రాజశేఖర్, గుండ్రాల గన్నారావు, ఆడారి రవికుమార్, సాలాపు నాగేంద్ర, యువత పాల్గొన్నారు.

మాడుగుల మిత్ర బృందం ఆత్మీయ సమ్మేళనం

48ఏళ్లుగా ఏటా కలుసుకుంటున్న పూర్వ విద్యార్థుల మిత్రబృందం

ప్రజాశక్తి-అనకాపల్లి : మాడుగుల జిల్లా పరిషత్ హై స్కూల్లో 1977 బ్యాచ్ ఎస్ఎస్‌సి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం 48ఏళ్లుగా నిరాటంకంగా కొనసాగుతోంది. ఇంటర్మీడియేట్ చదువుకున్న రోజుల్లోనే ఏటా ఆత్మీయ సమ్మేళనం జరుపుకోవాలని నిర్ణయించిన వారంతా ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ఇతర రాష్ట్రాల్లో ఎక్కడెక్కడో ఉన్నప్పటికీ, ఎవరింట్లో శుభకార్యం జరిగినా అందరూ కలుస్తారు. డిసెంబర్ నెలలో వనసమారాధన పేరిట కలుసుకుంటున్నారు. ఇందులో భాగంగానే ఆదివారం సమ్మేళనానికి తప్పక హాజరవుతూనే ఉన్నారు. వారిలో దురదృష్టవశాత్తు కొందరు కాలం చేసినప్పటికీ వారి స్మృతులను గుర్తుకు తెచ్చుకుంటూ 47 ఏళ్లుగా ప్రతి సంవత్సరం అందరూ కలుసుకుంటూనే ఉన్నారు. ఇందులో భాగంగా ఆదివారం 48వ ఏట అనకాపల్లి బొజ్జన్న కొండ సమీపంలోని పివిజిఆర్ రిసార్ట్ లో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. మిత్రబృందంలోని అనకాపల్లి పౌర సంబంధాల అధికారి డి. సాయిబాబా, విజయవాడ సైనిక సంక్షేమాధికారి వి.వి.రాజారావు, హెడ్మాస్టర్ జె. డి. చక్రవర్తి, టెలిఫోన్ అధికారి జె. శ్రీనివాసరావు (జె.ఎస్ఆర్) , ఏ.ఎస్.డబ్ల్యూక విశ్వనాథం, కే.సత్యారావు, ఏ.బి. ప్రసాద్, పి.ప్రకాశం దొర, బి. అప్పలరాజు, ఏ.లక్ష్మణరావు, ఎస్.నరసింహమూర్తి తదితర మిత్రులందరికీ ఆత్మీయ సమ్మేళనంలో కలిసి గత స్మృతులు, కుటుంబ పరిస్థితుల గూర్చి చర్చించుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనం ఎందరికో స్ఫూర్తిగా నిలిచిందని డిపిఆర్ఓ సాయిబాబా తెలిపారు.

టి20 క్రికెట్ పోటీలకు సంస్కృతి గ్లోబల్ స్కూల్ జట్టుకు ఆహ్వానం

సంస్కృతి గ్లోబల్ స్కూల్ క్రికెట్ జట్టు ఇదే

ప్రజాశక్తి పరవాడ: ఈ నెల 26 నుండి 29 వరకు హైదరాబాద్‌లో తెలంగాణ స్కూల్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న అండర్ -17 బాలుర అంతరరాష్ట్ర టి20 క్రికెట్ ఛాంపియన్ షిప్ పోటీలకు తమ పాఠశాల జట్టుకు ఆహ్వానం అందిందని సంస్కృతి గ్లోబల్ స్కూల్ స్పోర్ట్స్ డైరెక్టర్ జి. మధు బాబు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఆంధ్రప్రదేశ్ అంతరరాష్ట్ర స్కూల్. స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శన ఆధారంగా తమ పాఠశాల జట్టుకు ఈ అవకాశం లభించిందని, దీన్ని సద్వినియోగం చేసుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు పాఠశాల జట్టును జోగేంద్ర నాయుడు, ఆర్యన్ సోని, మోహిత్,జ్యోతీశ్వర్, ఫైజాన్, శశ్వత్ కుమార్, జె.తేజస్, సాహస్ బాలు, సిద్దార్థ్, మాలీజీ, శరన్ ప్రీత్, తేజస్ పటేల్‌లతో ఎంపిక చేశారు. కోచ్‌గా బషీర్ వ్యవహరిస్తారు. అంతరరాష్ట్ర పోటీలకు ఎంపికైన గ్లోబల్ సంస్కృతి క్రికెట్ జట్టును పాఠశాల సిఇఒ కె. నిశంత్ అభినందించారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

ప్రజాశక్తి- అనకాపల్లి : గవరపాలెం పెదరామస్వామివారి దేవాలయంలో వేదపండితులు బుజ్జి, రఘు, బాబీ సమక్షంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు అత్యంత భక్తిశ్రద్దలతో నిర్వహించారు. వైసీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ పూజా సామగ్రి అందజేశారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, పద్మావతి దంపతులు సత్యనారాయణ స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. వ్రతాల అనంతరం భక్తులకు రత్నాకర్ సహకారంతో సత్యనారాయణస్వామి ప్రసాదాలు, అల్పాహారం వితరణ చేపట్టారు. కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కరరావు, భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వికలాంగుల ఆటల పోటీలు

ప్రజాశక్తి- అనకాపల్లి :అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం స్థానిక ఎన్టీఆర్ గ్రౌండ్లో దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించారు. అనకాపల్లి వివిధ ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పాత్రపల్లి వీరు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను అనకాపల్లి జిల్లా అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్, వికలాంగులు, వృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.వి.జి జగదీష్ చేతులమీదుగా జండా ఊపి ఆటల పోటీలను ప్రారంభించారు.

అంగవైకల్యం, అంధులు, బధిరులు, మానసిక వికలాంగులు ఇలా నాలుగు విభాగాలుగా ఈ ఆటల పోటీలను ట్రై సైకిల్ రేస్, బ్యాటరీ ట్రైసైకిల్ రేస్, రన్నింగ్, జావ్లిన్ త్రో, డిస్క్ త్రో, షాట్ పుట్, క్రికెట్, క్యారమ్స్, చెస్, సింగింగ్ నిర్వహించారు. విజేతలకు ఏడి జగదీష్

విజేతలకు బహుమతుల ప్రదానంచేస్తున్న ఎఎస్పి, ఏడి

బహుమతులను అందజేశారు. ఆటలపోటీల్లో 400 మంది వికలాంగులు పాల్గొన్నారని వీరు యాదవ్ తెలిపారు. ఈ పోటీలను ఎస్.డి గ్రూప్స్ అధినేత కాండ్రేగుల శ్రీరామ్, జిల్లా విద్యాశాఖ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ ఆదారి రవికుమార్, వివిధ ప్రతిభావంతుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షురాలు నాలం ఆశకుమారి, విజువల్లీ చాలెంజర్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కొరుప్రోలు వెంకటేశ్వరావు, తుమ్మపాల జెడ్పి హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్ రవితేజ, గుడివాడ వరలక్ష్మి కోటవురట్ల, అమరపల్లి సిహెచ్.రామన్ రాయ్ డిఫెన్స్, శరగడం సూర్య ప్రకాష్, కరెంట్ ఆఫీస్, తుమ్మపాల ఈశ్వర అప్పారావు సహకారంతో నిర్వహించినట్లు వీరు యాదవ్ తెలిపారు. వికలాంగుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని వికలాంగుల సంక్షేమశాఖ ఏడి అన్నారు. కార్యక్రమంలో అడ్వకేట్ కనిశెట్టి సురేష్ బాబు, సిపిఐ నాయకులు రాజాన దొరబాబు, సూదికొండ మాణిక్యం, ఏఐవైఎఫ్ నాయకులు వియ్యపు రాజు, సంఘం కార్యదర్శి మొల్లి చంద్రశేఖర్, కోరుకొండ నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

అయ్యన్న పాఠశాలలో క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు

ప్రజాశక్తి- కె.కోటపాడు : స్థానిక అయ్యన్న ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శనివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రీస్తు పుట్టుకను తెలియజేసేలా ప్రదర్శించిన పాక, బొమ్మలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యుత్తు దీపాలంకరణలతో ఏర్పాటుచేసిన క్రిస్మస్ ట్రీకనువిందు చేసింది. క్రిస్మస్ పండగ సందర్భంగా స్కూల్ చిన్నారులు ఉత్సాహంగా ఉల్లాసంగా వేడుకల్లో పాల్గొన్నారు.అయ్యన్న ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ డైరెక్టర్ నూర్జహాన్ క్రిస్టమస్ కేక్ కట్ చేయగా క్రిస్మస్ తాతలు వేషధారణలో పలువురు చిన్నారులు కేక్ ను తోటి చిన్నారులకు పంచారు. దేవదూతల వస్త్ర ధారణల్లో చిన్నారులు ఏసుక్రీస్తు పాటలకు అనుగుణంగా చేసిన నృత్య ప్రదర్శనలు, వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాసిం అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో అధ్యాపకులు సుమతి, పద్మిని, శ్రావణి, మహాలక్ష్మి, చంద్రకళా, జ్యోతి, సరోజ, హేమ, మున్నీషా, డేవిడ్, సత్యవతి,ధనలక్ష్మి సాయిలక్ష్మీ, సమర్పణ, కళ్యాణి, రమణ, ప్రసాద్,రాజు, శివ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: స్థానిక ఐదు రోడ్ల జంక్షన్ లోని శాఖ గ్రంథాలయంలో ఆదివారం క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. శాంతా క్లాజ్ వేషధారణలో విద్యార్థులు అలరించారు. లైబ్రేరియన్ పి.దమయంతి ఆధ్వర్యంలో జరిగిన చిల్డ్రన్స్ క్లబ్లో భాగంగా విద్యార్థులు క్రిస్మస్ పాటలను పాడి పాఠకులను అలరించారు. ఈ సందర్భంగా దమయంతి మాట్లాడుతూ, క్రిస్టమస్ పండుగ, ఏసుప్రభు జన్మదినాన్ని వివరించారు. లైబ్రేరియన్ దమయంతి భర్త విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు పి ప్రభాకర్‌ల జన్మదినం సందర్భంగా పేద ప్రజలకు వస్త్ర దానం చేశారు.

ఆరిలోవ : ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ముడసర్లోవ రోడ్డులోని అసోసియేషన్ క్లబ్ వద్ద సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని కేకును కట్ చేసి వాకర్స్‌కు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కె.మోహనరావు, పిల్లి వీర్రాజు, అసోసియేషన్ అధ్యక్షులు మూర్తి, కార్యదర్శి ఈశ్వరరావు, బాలస్వామి, విలియం కేరీ, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : సెయింట్ ఆన్స్ కళాశాలలో క్రిస్మస్ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఫాదర్ ప్రదీప్ మాట్లాడుతూ, పాపులను రక్షించడం కోసం తన ప్రాణాన్ని త్యాగం చేసిన యేసు క్రీస్తు జీవితం ప్రేమ, శాంతి, కరుణలకు ప్రతీక అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి మాట్లాడుతూ, ఆపదలో ఉన్నవారికి సహాయపడమే క్రైస్తవ జీవన లక్ష్యం అన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. ఇటీవల జీవన సాఫల్య పురస్కారాన్ని పొందిన ఇపిఎస్.భాగ్యలక్ష్మిని సత్కరించారు. అనంతరం విద్యార్థినులు సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి-వీఆర్ పురం: మండలం పెద్దమట్టపల్లి పంచాయతీ కేంద్రంలో శనివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి రోడ్డున పడ్డ బాధితుడు పండా చిరంజీవిని ఆదివారం టిడిపి నేతలు పరామర్శించారు. శనివారం రాత్రి 9గంటల సమయంలో జరిగిన అగ్నిప్రమాదంలో చిరంజీవి ఇల్లు పూర్తిగా కాలిపోగా, ఇంట్లోని బీరువా, రెండు కూలర్లు, మంచాలు, దుస్తులు, ఆహారదినుసులు, ఇతర సామగ్రితోపాటు రూ.20వేలు నగదు కాలిబూడిదైంది. బాధితుడిని జెడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి, తెలుగుదేశం నేతలు పరామర్శించి ఓదార్చారు. బాధితుడిని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బురక కన్నా రావు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి సవలం రాజేంద్ర ప్రసాద్, నియోజక వర్గం వాణిజ్య విభాగ అధ్యక్షులు బీరక పాల్గొన్నారు.

ఆదివాసీలకు 'అమ్మ ట్రస్ట్' రగ్గుల పంపిణీ

రగ్గులను పంపిణీ చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

ప్రజాశక్తి- కె.కోటపాడు /అనంతగిరి: అల్లూరి జిల్లా అనంతగిరి మండలం కొత్తూరు పంచాయతీ శివారు కొత్తవలస, తోటవలస గ్రామాల్లో ఉన్న గిరిజనులకు అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం రగ్గులు పంపిణీ చేశారు. ట్రస్ట్ కుటుంబ సభ్యులంతా కాలినడకన కొండలపైనున్న ఆయా గ్రామాలకు వెళ్లి 25 కుటుంబీకులకు రగ్గులు అందజేశారు. ఈ సందర్భంగా అమ్మ ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకటరావు మాట్లాడుతూ చలికాలంలో ఏజెన్సీవాసులు ఎముకలు కొరికే చలిలోపడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, కొందరికైనా చలి నుంచి ఉపశమనం కలిగించాలనే లక్ష్యంతో తమ ట్రస్ట్ ద్వారా రగ్గులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఆయా గ్రామాల్లో విద్య, ఆరోగ్యం ఇతరత్రా అవసరాలపై అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ నిత్యం గిరిజనానికి సేవలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో సూరెడ్డి బాబూరావు, లెక్కల నారాయణరావు, లెక్కల సత్యనారాయణ, దొగ్గ ఎరుకు నాయుడు, మహిళా పోలీస్ లావణ్య, వాలంటీర్ రామకృష్ణ, స్థానిక గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

నిరుపేదలకు 'గ్రీన్‌క్లబ్' ఆసరా

గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు బియ్యం, రగ్గులు పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు నిరుపేదలకు ఐదు కేజీల బియ్యం, రగ్గులు పంపిణీ చేశారు. తుమ్మపాల చిన్నబాబు కాలనీ తిలక్ మార్గ్‌లో ఉన్న గ్రీన్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ మాస్టారు ఇంటి వద్ద కశింకోట ఎస్ఐ జక్కుల నాగేశ్వరరావు ఆర్థిక సహాయంతో 125 మంది పేదలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కొణతాల రామలింగస్వామి ట్రస్ట్ చైర్మన్ కొణతాల లక్ష్మీపార్వతి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, వైసిపి నాయకులు ఎరుబండి సత్యనారాయణ పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

మాట్లాడుతున్న న్యాయవాది రవి

ప్రజాశక్తి- సబ్బవరం.: జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక రేంజర్స్ డిఫెన్స్ అకాడమీలో ఆదివారం వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. .సుప్రీంకోర్టు న్యాయవాది రవి మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అవినీతిని అంతం చేయాలంటే ప్రతిఒక్కరూ ముందుగా తనకున్న హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. హైకోర్టు న్యాయవాది సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ వినియోగదారుల ఎటువంటి మోసాలకు గురైనా, బాధ్యులపై ఫిర్యాదు చేస్తే తప్పక కేసు నమోదు చేయడంతోపాటు బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గ నాయకులు గొర్లి రామునాయుడు, జిల్లా కోర్టు న్యాయవాది మాధురి, డిఫెన్స్ అకాడమీ కరెస్పాండెంట్ పోతల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా కుంచావారి గైరమ్మ సంబరం

ఉత్సవాల్లో సాంస్కృతిక ప్రదర్శన

ప్రజాశక్తి- అనకాపల్లి : కుంచావారి గౌరీ పరమేశ్వరుల మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలు పట్టణ ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. డాన్స్ బేబీ స్టేజీలు, బుర్రకథ ప్రోగ్రామ్స్‌తో మెయిన్ రోడ్డు భారీ జనాల మధ్య గైరమ్మ సంబరాలు అంబరాన్ని అంటింది. గైరమ్మ ఉత్సవాలకు సహకరించిన అందరికీఉత్సవ కమిటీ చైర్మన్ ఎం వీరభద్రరావు (అబ్బులు),గౌరవ అధ్యక్షులు పొందంగి సత్య రావు, కొరుకొండ సాంబశివరావు, పాలూరి శ్రీనివాసరావు, కొమ్మోజి రామకష్ణ (బిఎస్ఎన్ఎల్),బొండ జాడేష్ అదేపల్లి పోతురాజు,కుంచా దివాకర్, కుంచా సందీప్, కుంచా వారి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి- మునగపాక: మండల కేంద్రమైన మునగపాక లో వాహనదారుల భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ఆదివారం స్థానిక ఎస్ఐ షేక్ మహమ్మద్ ఆలీ షరీఫ్ అవగాహన కల్పించారు. రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనదారులను ఆపి హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవడంతోపాటుగా ప్రమాదాలను నివారించ వచ్చునని సూచించారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ వలన జరిగే అనర్థాలను వాహనదారులకు సూచించారు. ఏఎస్ఐ మన్మధరావు పాల్గొన్నారు.

వాహనదారులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ మహమ్మద్

దట్టంగా కురిసిన పొగమంచు

రోడ్డు కనిపించనంతగా కురుస్తున్న మంచు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని తాళ్లపాలెం, నర్సీపట్నం రోడ్డులో ఆదివారం ఉదయం ఎనిమిది గంటలైనా దట్టంగా కమ్ముకున్న పొగమంచుతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దగ్గరగా ఉన్న వాహనాలు కూడా కనిపించని పరిస్థితుల్లో హెడ్‌లైట్ల వెలుగులో ప్రయాణాలు సాగించారు. రైతులు కూడా వ్యవసాయ పనులకు వెళ్లేందుకు ఇబ్బందులుపడ్డారు. కాస్తా ఎండకాసి, మంచు తెరలు విడిపోయాక పొలాలకు వెళ్లారు. కాగా దట్టంగా కురిసిన పొగమంచు అందాలు కొందరిని మంత్రముగ్ధులను చేశాయి.

అగ్ని ప్రమాద బాధితునికి అండ

ప్రజాశక్తి -ఎటపాక : మండలంలోని గన్నవరం గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన బాధితుడు రావి భూషణం కుటుంబానికి ఎటపాక మండలంలోని పత్రికా విలేకరులు ఆదివారం సాయాన్ని అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన బాధితుడు రావి భూషణంకోసం నగదును, నిత్యవసరాలు, కూరగాయలు, దుస్తులను మానవతాదృక్పథంతో సాయం చేశారు. కార్యక్రమంలో విలేకరులు వి శివకుమార్, ఎం శ్రీనివాసరావు, షబ్బీర్, పి.బాలకృష్ణ (ప్రజాశక్తి), పి రాంబాబు, ఆర్ కార్తీక్ పాల్గొన్నారు.

ఆ గ్రామానికి వెళ్లాలంటే...

ముక్కు మూసుకోవాల్సిందే!

రామచంద్రపాలెం గ్రామ ముఖద్వారం

ప్రజాశక్తి-కోటవురట్ల: రామచంద్రపాలెంకి వెళ్లా లంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సిందే. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్, స్వచ్ఛ మిషన్ అంటూ పలు కార్యక్రమాలు ప్రవేశ పెడుతున్నా అమలు విషయానికి వస్తే మాత్రం గ్రామీణ ప్రాంతాల్లో అమలు కాలేదు. రామచంద్ర పాలెం గ్రామం ముఖద్వారం వద్ద గ్రామస్తులు బహిర్భూమికి (మలవిసర్జన) వినియోగిస్తూ ఉండటంతో గ్రామస్తులతో పాటు రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులు కూడా తీవ్ర దుర్గంధంతో అవస్థలు పడుతున్నారు.ప్రధాన రహదారిపై మల విసర్జన చేయడంపై స్థానిక నాయకులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పరిస్థితి మారలేదు.పాఠశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు పొలాలకు వెళ్లే రైతులు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో పశువులు, మేకలు మేపుకునే రైతులు వాటిని పొలాలకు తీసుకు వెళ్తున్న సమయంలో మరింత ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు నాయకులు ఇప్పటికైనా స్పందించి గ్రామస్తులకు బహిర్భూమి వినియోగం పట్ల అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

నిరుపయోగంగా పంచాయతీ కార్యాలయాలు



రామచంద్రపురం పంచాయతీ కారాల్యయం

ప్రజాశక్తి -కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామీణ ప్రాంతాలలో చేపట్టిన సచివాలయ వ్యవస్థ కారణంగా మండలంలో పలు గ్రామ పంచాయతీ కార్యాలయాలు వృథాగా దర్శనమిస్తున్నాయి. మండల వ్యాప్తంగా 25 గ్రామ పంచాయతీలకు గాను రాష్ట్ర ప్రభుత్వం 19 సచివాలయాలను ఏర్పాటు చేసింది. తద్వారా సచివాలయాలలో సిబ్బందిని నియమించడంతో పాటు పలు సేవలు సచివాలయాల ద్వారానే

ఆక్షబ్‌పేట పంచాయతీ కార్యాలయం



గొట్టువాడ

కొనసాగుతున్నాయి. మండలంలో జల్లూరు, ఆక్సైబ్ పేట, జగ్గంపేట, గొట్టువాడ, రామన్నపాలెం, రామచంద్రపురం గ్రామపంచాయతీ కార్యాలయాలకు గాను ఐదు పంచాయతీ కార్యాలయాలు వృధాగా దర్శనమిస్తున్నాయి. రామన్నపాలెం పంచాయతీ కొత్తగా ఏర్పడడంతో కార్యాలయం నిర్మించాల్సి వుంది.మారుమూల గ్రామాలైన జగ్గంపేట, ఆక్సుబ్ పేట,

జగ్గంపేట

ప్రజలు పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ పట్ల ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జల్లూరు

విద్యార్థిని సాయి ప్రీతికి సత్కారం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ఏకలవ్య గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని సాయి ప్రీతి అర్చరీ విభాగంలో బంగారు పతకాలు సాధించడంతో ఎమ్మెల్యే పాల్గుణ అభినందించారు. అరకులోయ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యార్థినిని సత్కరించి అభినందించారు. ఆయన మాట్లాడ్డారు ప్రైవేటు బడులకు దీటుగా ప్రభుత్వ బడులను ప్రభుత్వం నడిపిస్తుందన్నారు. ఉన్నత చదువులతో పాటు క్రీడలను ప్రోత్సహిస్తోందన్నారు. గిరిజన విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. జెడ్పిటిసి సభ్యురాలు జానికమ్మ, మండల అధ్యక్షుడు మలేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి మండల యువజన అధ్యక్షుల నియామకం

ఎమ్మెల్యే బాబూరావుకు కృతజ్ఞతలు తెలుపుతున్న సాయి

ప్రజాశక్తి -కోటవురట్ల: వైసిపి మండల యువజన పార్టీ అధ్యక్షునిగా నీలిగుంట గ్రామానికి చెందిన కరెడ్ల సాయిని నియమించడం పట్ల మండల వ్యాప్తంగా శ్రేణులు అతనికి అభినందనలు తెలిపాయి. అనంతరం స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావును కలిసి ఈ మేరకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ, పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని, ప్రభుత్వం చేపడుతున్న పథకాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. యువతను ప్రోత్సహించి పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ దత్తుడు రాజు, నీలిగుంట సర్పంచ్ వరహాల బాబు, చౌడువాడ సర్పంచ్ గోపాలకష్ణ, వైసిపి నాయకులు కన్నబాబు, వై.రమణ తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ: మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడిగా గొల్లవెల్లి స్వామి నాయుడిని రెండవసారి నియమించారు. ఈ సందర్భంగా స్వామినాయుడు మాట్లాడుతూ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తనపై నమ్మకంతో మండల యూత్ అధ్యక్షుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ పటిష్టానికి కృషి చేస్తానని స్వామి నాయుడు అన్నారు.

స్వామినాయుడు

ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా వెంకన్న తిరువీధి సేవ

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాజాధి రాజ వాహనంపై శ్రీనివాసుడు భూదేవి, శ్రీదేవి సమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. దాతల భాగస్వామ్యంతో రాజాధిరాజు వాహనంపై వైభవంగా తిరువీధి సేవ నిర్వహించారు.పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు ,ఇన్స్పెక్టర్ వెంకట కూర్మేశ్వరరావులు మాట్లాడుతూ టిటిడి అధికారుల ఆదేశాల మేరకు భక్తుల భాగస్వామ్యంతో ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు ఎవరైనా స్వామి వారి సేవలను, భక్తులకు ఉచిత అన్నప్రసాదాలను పంపిణీ చేయించాలనుకుంటే ముందుగా దేవాలయం సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

అసహనం వ్యక్తం చేస్తున్న ఆర్డీవో జయరామ్

ప్రహరీ నాణ్యతాలోపంపై ఆర్‌డిఒ అసహనం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక అబీద్ సెంటర్ నుండి పెద బొడ్డేపల్లి వరకు రోడ్డు విస్తరణలో భాగంగా స్థానిక ఆర్డిఓ కార్యాలయం వద్ద గోడను నూతనంగా నిర్మిస్తున్నారు.ఈ నిర్మాణంపై ఆర్డీవో సిహెచ్ జయరాం అసహనం వ్యక్తం చేశారు. గోడ నాణ్యత లోపంతో నిర్మిస్తున్నారని ఆదివారం ఆయన గుత్తేదారుని ప్రశ్నించారు. గోడ నిర్మాణ పనులు ప్రారంభం చేసి దగ్గర నుండి ఒక్కరోజైనా నీటితో తడప లేదని గుత్తేదారులను ప్రశ్నించారు నాణ్యత లోపంతో నిర్మిస్తే ఎన్ని రోజులు గోడ నిలబడుతుందని, ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. దీంతో గుత్తేదారు నీళ్లు నములుతూ గోడ నిర్మాణ పనుల్లో లోపం లేకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు.

కార్యాలయంలో ఉన్న సాధువు

ఆర్‌డిఒ కార్యాలయంలో సాధువు హల్‌చల్

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో సాధువు వేషంలో ఉన్న వ్యక్తి ఆదివారం హల్‌చల్ చేశాడు. ఆర్డీవో కార్యాలయంలోకి వెళ్లి సిబ్బందిని బెదిరించి కంప్యూటర్ల ముందు కూర్చుని కాసేపు హడావుడి చేశాడు. గతంలో ఇదే వ్యక్తి నర్సీపట్నంలో వాహనాలను ఆపుతూ బీభత్సం సృష్టించాడు. ఇతని చర్యలకు విసుగెత్తిన ప్రజలు దేహశుద్ధి చేశారు. తిరిగి మరలా నర్సీపట్నంలో ప్రత్యక్షమై అలజడి సృష్టిస్తున్నాడు దీంతో సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బయటికి వెళ్లి పోయాడు.

వాడవాడలా కొవ్వొత్తుల ప్రదర్శనలు

-13వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మె ఉధృతంగా మారుతోంది. గత ఎన్నికల్లో సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని అంగన్‌వాడీలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో ని పలు చోట్ల ఆదివారం కొవ్వొత్తుల ప్రదర్శలు చేపట్టారు. మరికొన్ని చోట్ల కొలాటంతో నిరసనను తెలియజేశారు.

నక్కపల్లి:తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడి వర్కర్స్ చేపట్టిన సమ్మె ఆదివారం నాటికి 13వ రోజుకు చేరింది .మండల పరిషత్ కార్యాలయ సమీపంలో ఏర్పాటుచేసిన రిలే నిరాహారదీక్ష శిబిరం వద్ద ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ అంగన్వాడి వర్కర్స్ కోలాట ప్రదర్శన చేశారు.తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో అంగన్వాడీ కేంద్రాలను తెరిపించడ సరికాదని అంగన్‌వాడీలు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణీలు, బాలింతలు వారికి ఎలా తెలుసునని ప్రశ్నించారు.తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 13 రోజుల నుండి ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం సమస్య పరిష్కారానికి మార్గం చూపకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తమ పట్ల మొండివైఖరిని ప్రదర్శిస్తుందని ఇది సరైన పద్ధతి కాదన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి, యూనియన్ నాయకులు కవిత, లక్ష్మీ రాజ్యం, మంగ లక్ష్మి, రమణమ్మ, జయ, ఆర్‌వికె లక్ష్మీ పాల్గొన్నారు.

పరవాడ: మండలంలోని లంకెలపాలెం కూడలిలో ఆదివారం సాయంత్రం అంగన్‌వాడీలు కొవ్వుత్తులు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో అంగన్‌వాడీలకు మద్దతుగా లబ్ధిదారులు పాల్గొన్నారు. న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమ్మెపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. భేషజాలకు పోయి బెదిరింపు చర్యలకు దిగడం మానుకోవాలన్నారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలుచేయకపోవడం విచారకరమన్నారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు రమణి తదితరులు పాల్గొన్నారు.

పరవాడ మండలం గొర్లివానిపాలెం పాలెం పంచాయతీ బసవతారక కాలనీ కొవ్వొత్తుల ప్రదర్శనలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ, అంగన్వాడీల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి సరికాదని, తక్షణమే ఇచ్చిన హామీలను అమలు చేసి సమ్మెను విరమింపజేయాలని కోరారు. అంగన్వాడీలతో పెట్టుకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీయూనియన్ నాయకులు సిహెచ్ దేవి, కె.లక్ష్మి, జి భవాని, బి. జానకి, లబ్ధిదారులు బి శాంతిలక్ష్మి, డి మంగ, కె.స్వాతి, జి శిరీష, కే లక్ష్మి, ఎంఎ దేవి, కే ఉమా, పి పావనిపాల్గొన్నారు

బుచ్చయ్యపేట : అంగన్వాడీల యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మండల కేంద్రంలో ఆదివారం రాత్రి అంగన్వాడీలు వెలిగించిన కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు.ఉద్యోగ భద్రత కల్పించాలని వేతనాన్ని పెంచాలని ఇతరసమస్యలను పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. నిరసనలో అంగన్వాడీలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు

కోటవురట్లలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

లంకెలపాలెంలో కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, నాయకులు

వడ్డాది: వడ్డాదిలో అంగన్‌వాడులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికీ 13రోజుల నుండి సమ్మె చేస్తున్న ప్రభుత్వానికి కనబడ లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో డ్వాక్రా విఒ సుంకర చిట్టెమ్మ, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

కోటవురట్ల: ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని గడిచిన 13 రోజులుగా అంగన్వాడీలు చేపడుతున్న దీక్షలు మండల కేంద్రంలో ఆదివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, తక్షణమే ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నక్కపల్లిలో కోలాటం ఆడుతున్న అంగన్‌వాడీలు

మునగపాక : అంగన్వాడీల సమ్మెలో భాగంగా ఆదివారం రాత్రి అంగన్వాడీ టీచర్లు, ఆయాలు కొవ్వొత్తులను వెలిగించి నిరసన చేపట్టారు. ప్రభుత్వం మొండివైఖరి నశించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో హేమలత, సరస్వతి, ఉమాదేవి, బి రేవతి పద్మ, శివ గణేష్ అమ్మ, లక్ష్మి ,సత్యవతి, కుమారి, లక్ష్మి పాల్గొన్నారు.

కశింకోట: అంగన్వాడీ సమ్మె దీక్షలో భాగంగా కశింకోటలో అనకాపల్లి ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. లబ్ధిదారులు సంఘీభావం తెలిపి పాల్గొన్నారు. కార్యక్రమంలో యు. సత్యవతి, ఎస్. వెంకటలక్ష్మి , పి.సత్యవేణి, ఎస్. ఉమా, బాలబాలికలు పాల్గొన్నారు. యూనియన్ నాయకులు తనుజ, శ్యామల, కుమారి, ఐద్వా జిల్లా నాయకురాలు డిడి.వరలక్ష్మి , సిఐటియు. జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సబ్బవరం: అంగన్వాడీల సమ్మెదీక్షల్లో భాగంగా వెలిగించిన కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు వి.వి.రమణమ్మ, ఎం.వరలక్ష్మి, పుష్ప, జగదీశ్వరి, వి. సుభాషిణి, ఎం. కనకమ్మ,జి. అరుణ కుమారి,ఎస్. రమణమ్మ, డి. భారతి, ఎ. రమణమ్మ, పి. సూరమ్మ, ఎన్. సత్యవేణి పాల్గొన్నారు.

రాంబిల్లి: మండలంలోని కొత్తపట్నం, కొత్తపేట గ్రామాలలో అంగన్వాడీలకు మద్దతుగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేవుడ నాయుడు, డివైఎఫ్ఐ నాయకులు, నారాయణరావు, శ్రీను, ధనరాజ్, దుర్గారావు, ఎన్ఎఒబి కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికులు, పంచాయతీ కార్మికులు, ఆశ కార్మికులు, మహిళలు అంగన్వాడీ లబ్ధిదారులు పాల్గొన్నారు.

నక్కపల్లి:అంగన్వాడి వర్కర్స్ పై ప్రభుత్వం మొండి వైఖరిని నిరసిస్తూ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీతో నిరసన తెలిపారు. అంగన్వాడి చిన్నారులు, విద్యార్థుల తల్లిదండ్రులు కలిసి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. అంగన్వాడి వర్కర్స్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి , అంగన్వాడీ కేంద్రాలు తెరిచే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు

విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అంగన్‌వాడీలు ఒంటి కాలిపై నిల్చొని వినూత్నంగా నిరసన తెలిపారు. వారినుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుండా బలవంతంగా తాళాలు బద్దలు కొట్టించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అంగన్‌వాడీల పోరాటానికి సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, ఐద్వా, పిఒడబ్ల్యు, వీరమహిళ, విద్యార్థి, యువజన, న్యాయవాదుల సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నేతలు వై.తులసి, ఇందిర, ఈశ్వరమ్మ, రత్నం, వెంకటలక్ష్మి, శోభారాణి, నాగేశ్వరి, ఉమ, శ్రీదేవి, శ్యామలాదేవి, రాజేశ్వరి పాల్గొన్నారు.

పెందుర్తి : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా నగర ప్రధాన కార్యదర్శి పద్మ మాట్లాడుతూ, జగన్ పాలన నియంతలా ఉందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి బి.జగన్, ఐద్వా నాయకులు బి.అనంతలక్ష్మి, అంగన్‌వాడీ రాష్ట్ర యూనియన్ ఉపాధ్యక్షులు బృందావతి, భవానీదేవి తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా జివిఎంసి మూడో వార్డు పరిధి తోట వీధి, మండలంలోని కృష్ణంరాజుపేట, మజ్జివలస, ఆశిపాలెంలో అంగన్‌వాడీలు లబ్ధిదారులతో కలిసి ఆదివారం రాత్రి ఆయా అంగన్‌వాడీ కేంద్రాల వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు.

ఆనందపురం మండలం, పాలవలస అంగన్‌వాడీ కేంద్రం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు భీమిలి జోన్ అధ్యక్షులు ఆర్ఎస్ఎన్.మూర్తి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పాత గాజువాక నుంచి కొత్తగాజువాక వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నమ్మలు, జ్యోతి, సాయి సరస్వతి, వేణుశ్రీ, సుజాత, సిఐటియు నాయకులు శ్రీనివాసరాజు, కోవిరి అప్పలరాజు, ఎం.రాంబాబు, ఐద్వా నాయకులు లక్ష్మి పాల్గొన్నారు.

గాజువాకలో కొవ్వొత్తుల ప్రదర్శన

అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం మద్దతు

13 రోజుల నుంచి అంగన్‌వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మెకు మద్దతుగా ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అఖిలపక్ష కార్మిక, ఉద్యోగ, విద్యార్థి, యువజన, మహిళా, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, టిఎన్‌టియుసి, ఎపిఎఫ్‌టియు సంఘాల నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిఎస్‌కె.అచ్యుతరావు, ఎం.వెంకటేశ్వర్లు, దేవా, స్టీల్‌ప్లాంట్ పర్మినెంట్, కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు యు.రామస్వామి, రామకృష్ణ, శ్రీనివాస్, నమ్మి రమణ, బిఎస్‌ఎన్‌ఎల్ యూనియన్ నాయకులు సాగర్, పోర్టు యూనియన్ నాయకులు మసేన్, ఈశ్వరరావు, బిహెచ్ఇఎల్ నాయకులు ప్రకాష్, ఐద్వా, మహిళా సమాఖ్య, పిఒడబ్ల్యు, వీర మహిళా నాయకులు అనురాధ, ఎ.విమల, ఎం.లక్ష్మి, పసుపులేటి ఉషాకిరణ్, విద్యార్థి, యువజన నాయకులు యు.నాగరాజు, యుఎస్ఎన్.రాజు, కెవిపిఎస్ నాయకులు వై.రాజు, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ నాయకులు జి.అప్పలరాజు, కాసుబాబు, ఎండిఎం నాయకులు మంగశ్రీ, భవాని, అంగన్వాడీ యూనియన్ నాయకులు వై.తులసి, శ్యామలాదేవి పాల్గొన్నారు. విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గు నాయుడు, నాయకులు పడాల రమణ, న్యాయవాదులు వెంకటేశ్వరరావు, గిరిధర్, తదితరులు మాట్లాడారు. అంగన్వాడీల డిమాండ్లు న్యాయమైనవని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీల పోరాటానికి మద్దతు తెలుపుతున్న కార్మిక, ప్రజా సంఘాల నేతలు